

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**బాంధ్ ప్రీతి ఫూల్ డోర్**

**మన్ లేకే చిత్ చోర్**

**దూర్ జానా నా, దూర్ జానా నా..**

1951వ సంవత్సరంలో లతా మంగేష్కర్ ఎన్ని గొప్ప పాటలు పాడింది. ఈ నాటికీ ప్రజల నాల్కలపై నడయాడుతూ హృదయాలను ఆనందమయం చేసే సజీవమైన గీతాలను గానం చేసింది. కానీ 'మాలతీ మాధవ' అనే సినిమాలో పండిత నరేంద్రశర్మ రచించిన ఈ గీతం ఆ సంవత్సరమే కాదు, లత సినీ సంగీత జీవితంలో పాడిన అత్యద్భుతమైన , అతి మధురమైన గీతాలలో అగ్రస్థానంలో నిలుస్తుంది. లతా తనకిష్టమైన పాటల జాబితాలో ఈ పాటకు అగ్రస్థానం కేటాయించింది.

హిందీ సినీ గేయ రచయితలలో పండిత నరేంద్ర శర్మది ప్రత్యేక స్థానం. ఈయన గొప్ప హిందీ కవి. పండితుడు. హిందీ సినీ గీతాలలో కొన్ని అత్యద్భుతమైన కవితాత్మక గీతాలను శుద్ధ హిందీలో రచించిన వాడాయన.

'భాభీ కీ చూడియాన్' సినిమాలోని 'జ్యోతి కలశ్ ఛల్కే', ' సత్యం శివం సుందరం' సినిమాలో 'ఈశ్వర్ సత్యహై' 'యశోమతి మయ్యాసే' వంటి అర్ధవంతమైన, అద్భుతమైన గీతాలను రచించాడు పండిత నరేంద్ర శర్మ. ఆయన పాటలు రాస్తున్నాడంటే, అన్ని అభ్యంతరాలను, అహంకారాన్ని, పట్టుదలలను పక్కన పెట్టి, అత్యుత్సాహంగా, స్వచ్ఛందంగా పాటలు పాడేది లతామంగేష్కర్, అంటేనే, పండిత నరేంద్రశర్మ గేయ రచన అత్యుత్తమ స్థాయిని అర్ధం చేసుకోవచ్చు.

'యూసుఫ్ ఖాన్'కు దిలీప్ కుమార్ అని నామకరణం చేసింది పండిత నరేంద్ర శర్మనే. ఆల్ ఇండియా రేడియోను మరింత ఆకర్షణీయం చేసి శ్రోతలను ఆకర్షించేందుకు 'వివిధభారతి'ని ఏర్పాటు చేసింది కూడా పండిట్ నరేంద్ర శర్మనే. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ హిందీ సెక్రటరీగా పనిచేసిన నరేంద్ర శర్మ నెహ్రూ కోరికననుసరించి వివిధ భారతిని

ఏర్పాటు చేశాడు. వివిధ భారతి ప్రసారం చేసిన తొలిగీతం 'నాచ్ రే మయూరా' రచించింది నరేంద్ర శర్మనే. హిందీ, ఉర్దూ సాంప్రదాయక కవిత్వానికి స్వీయ సృజనాత్మకతను జోడించి అలతి అలతి పదాలలో మధురమైన భావనలను పొదిగి మనోహరంగా ప్రదర్శిస్తాడు పండిట్ నరేంద్ర శర్మ.

భవభూతి రచించిన 'మాలత్ మాధవ' విభిన్న తరాల సినీ కళాకారులకు ముడి సరుకుని అందించింది. 1940లో తెలుగులో 'మాలతీ మాధవం' సినిమా రూపొందించింది. 1951లో హిందీలో 'మాలతీ మాధవ' విడుదలయింది. అంతకు ముందు 1933లో హిందీలో మాలతీ మాధవను సినిమాగా తీశారు. 1971లో కన్నడలో మరో మాలతీ మాధవ రూపొందింది. 'పాతాళ భైరవి' సినిమా కథను ప్రేరణ మాలతీ మాధవమే.

ప్రేమ పూల దారంతో ప్రేమ బంధాన్ని స్థిరపరచిన తరువాత తన మనస్సును దొంగిలించి తనను వదలి దూరం వెళ్లవద్దని నాయకుడిని బ్రతిమిలాడుతూ, అభ్యర్థిస్తూ నాయిక పాడే పాట 'బాంధ్ ప్రీతి పూల్ డోర్'. పాటను అతి మృదు మంజులమైన పదాలతో, అతి సున్నితమైన భావనలను మృదుమధురంగా ప్రదర్శించాడు పండిత నరేంద్ర శర్మ. చిత్ చోర్, మోహన వంటి పదాలవాడకంతో ఈ ప్రేమ గీతానికి భజన స్థాయిని ఆపాదించి , భక్తిగీతంగానిలిపాడు గేయ రచయిత నరేంద్ర శర్మ.

ప్రేమ పూల దారాలతో బంధించి హృదయాన్ని గెలుచుకున్నవాడా, నా మనస్సును వెంట తీసుకుని దూరం వెళ్లిపోవద్దు అని నాయిక పాడుతోంది. వారిద్దరి నడుమ ప్రేమ ఉందని కవితాత్మకంగా చెప్తున్నాడు కవి. ప్రేమపూల మాలతో రెండు హృదయాలను బంధించిన తరువాత తనను వదలి వెళ్లద్దంటోంది నాయిక. 'ప్రేమ అనే పూల దారంతో హృదయాలను బంధించి' గొప్ప ఊహ.

ఈ పాట పాడినప్పుడు లతా మంగేష్కర్ వయస్సు 21 –22 నడుమ ఉంటుంది. కానీ ఆమె ఈ పాటను ఎంతో గొప్పగా, ప్రేమ భావనలోని ఔన్నత్యాన్ని, విరహవేదనలోని బాధ లోతును తన స్వరంలో నింపి ప్రదర్శించింది. ముఖ్యంగా, 'దూర్ జానా' అని అంటున్నప్పుడు, ఆ స్వరంలోని అభ్యర్థన, వేదన, అమాయకత్వం మనసును కలచివేస్తుంది. ఆ వయసులో ఇంత గొప్పగా భావప్రకటన చేయగలగటం ఎంతో గొప్ప విషయం. అందుకే హిందీ సినీ సంగీత దర్శకులు లతను వదలి మరే గాయనితో పాడించేందుకు కొన్ని దశాబ్దాలు ఇష్టపడలేదు. దూర్ జాన నా అన్న ప్రతిసారీ విభిన్నమైన భావనలు కలిగిస్తూ, విభిన్నమైన రీతిలో ప్రత్యేకంగా పలుకుతుంది లతా. ఇదే పద్ధతి మహమ్మద్ రఫీలోనూ కనిపిస్తుంది. ' ఎహెసాన్ తెరా హోగా ముఝ్ పర్ ' పాటలో 'ముహబ్బత్' అన్న పదం ఎన్నిమార్లు పలికితే అన్నిమార్లూ ప్రత్యేకంగా,

విభిన్నంగా పలుకుతాడు. లతా, రఫీ ఇద్దరూ ప్రతిపాటలో ఇలా, ఒక వాక్యాన్నో, ఒక పదాన్నో, ఒక భావాన్నో ఎంచుకుని పాటలో ఆ ఎంపికచేసినదాన్ని ఎన్నిమార్లు పలికితే అన్ని మార్లూ దాన్ని ప్రత్యేకంగా ధ్వనింపచేస్తారు.

మృదు మధురమూ, కోమలమయిన ఈ పాటను సుధీర్ పడ్కే రూపొందించిన విధానం, అతని ప్రతిభకు అద్దం పడుతుంది.

జైజయవంతి రాగం, హిందుస్తానీ రాగాలలో సున్నితమైన భావప్రకటనకు పేరుపొందింది. గురు తేజ్ బహదూర్ ఈ రాగంలో రాసిన భక్తి గీతాలు 'గుర్బానీ'లో చోటు చేసుకున్నాయి. అతి క్లిష్టమైనా, అత్యంత మనోహరమూ, మంజులమైన రాగం ఎంతో ఆనందాన్ని, శాంతినిస్తుంది . ఈ పాటకు ఈ రాగాన్ని ఎంచుకోవటం వల్ల ఈ ప్రేమగీతం సున్నిత భావాలను కలిగిస్తుంది. వింటూంటే మనసుకు శాంతిని కలిగించటమే కాదు, పాట మాధుర్యానికి ఆనందంవల్ల కంట నీరు వస్తుంది.

ఈ పాటలో గమనించాల్సిందేమిటంటే, సంగీత 'పరిభాష'లో, 'ఠహరావ్' అంటారు అది. 'ఠహరావ్' అంటే స్థిరత్వం. నియంత్రణ. ఒక 'నోట్'ను ప్రశాంతంగా సరిగ్గా, చక్కగా, ఎంతో లోతైన భావనలతో స్థిరంగా పట్టి ఉంచగలగటం. ఇందువల్ల శ్రోత ఆ భావాన్ని మరింతకాలం, మరింత గాఢంగా అనుభవించగలుగుతాడు. అంటే, గాయకుడు, ఒక భావాన్ని ప్రదర్శించే స్వరాన్ని పట్టి ఉంచి, మీండ్, గమకాలతో ఆ శ్రోత మనస్సుకు మరింత చేరువు చేస్తాడన్నమాట. ఇది గాయకుడికి శ్వాసపై ఉన్న నియంత్రణను చూపిస్తుంది.

ఈ పాటలో లతా మంగేష్కర్ 'దూర్ జానవా' అన్న ప్రతిసారీ ప్రత్యేకంగా అంటుంది. ఓసారి 'దూర్' వద్ద మరోసారి 'జాన నా', వద్ద ఆగుతుంది. రాగాన్ని లాగుతుంది. దీర్ఘం తీస్తుంది. ఇది పాట భావాన్ని మరింత చిక్కగా చేసి శ్రోతను మైమరపింపచేస్తుంది. ముఖ్యంగా 'బాంధ్ ప్రీతి ఫూల్ డోర్' అని ఒక్క సెకను ఆగి 'మన్ లేకె' అని అందుకోవటం అద్భుతమైన ఎఫెక్ట్ ఇస్తుంది. ఒకో పదాన్ని లత రాగయుక్తంగా, భావ ప్రకటన చేస్తూ పలికిన తీరు ఈ పాటను అత్యున్నత శిఖరంపై నిలుపుతుంది.

పాట ఆరంభంలో వినిపించే సితార్ పాట మూడ్‌ను స్థిరపరుస్తుంది. లత పాట ఆరంభించగానే 'ఆహా' అనిపిస్తుంది.

**మన్ కే కివార్ ఖోల్**

**మీత్ మేరే అన్మోల్**

**భూల్ జానా నా... భూల్ జానా నా**

చాలా అలతి పదాలు. మనస్సు ద్వారం తెరువు, ఓ ప్రియతమా, నన్ను మరచిపోవద్దు అంటోంది నాయిక. పదాలలోనే భావ తీవ్రత లత స్వరంలో, రాగంలో కనిపిస్తుంది. ఈ చరణం వింటూంటే జైజయవంతీ రాగాధారిత మరో అద్భుతమైన పాట మనసులో మెదలుతుంది.

**బనే థే ఖిలాడీ పియా, నిక్ లే అనాడీ**

**మోసే బేయీమానీ కరే, ముఝ్ సే హీ రూఠే**

**మన్ మోహనా బడే ఝూఠే...**

'సీమ'లో శంకర్ జైకిషన్ సంగీత దర్శకత్వంలో సంగీత కచేరీ చేస్తున్నట్టు లత పాడిన పాట గుర్తుకు వస్తుంది. రెండు పాటలు 'జైజయవంతి' రాగ మాధుర్యాన్ని ప్రస్ఫుటం చేస్తాయి. మనసు ప్రశాంతమయి పోతుంది ఈ పాటలు వింటూంటే. సంగీతం గొప్పతనం, రాగాలలో ఒదిగి ఉన్న మానసిక చికిత్స లక్షణం తెలుస్తాయి. లత 'కివాడ్ ' అనే బదులు 'కివార్' అంటుంది. అర్థం ఒకటే అయినా 'కివార్ ' అనటంలో ఒక సాన్నిహిత్యం, సున్నితత్వం కనిపిస్తాయి.

**కైసే సహూ విఛోహన్, మన్ మే రమా హై మోహన్**

**రూఠ్ జానా నా,ఝూఠ్ జానా నా...**

ఇంతవరకూ ప్రియుడిని తనను వదలి దూరం వెళ్లవద్దని నాయిక ప్రార్థిస్తున్న గీతం అనుకుంటాం. ఇక్కడ 'మన్ మే రమాయే మోహన్ ' అనటంతోటే పాటను అర్థం చేసుకునే దృష్టి మారిపోతుంది. ఆమె ప్రియుడు శ్రీకృష్ణుడు. 'విచోహన్ ' అంటే విరహవేదన. విరహవేదనను ఎలా భరించాలి. మనస్సు మోహనుడిపై లగ్నమైంది. కోపగించుకుని, దూరం వెళ్లకు అంటోంది. చిత్ చోర్, మోహన్ వంటివన్నీ శ్రీకృష్ణుడి పేర్లు.

ఈ చరణాన్ని ఎంతో శ్రద్ధగా, ప్రత్యేకంగా రూపొందించాడు సుధీర్ పడ్కే. 'విఛోహన్' అన్న పదాన్ని లత సాగదీసి, రాగంతో పలికిన తీరు అద్భుతం అనిపిస్తుంది. విరహంలోని వేదన అనుభూతికి వస్తుంది. ఆ కాలంలోనే కాదు ఈ కాలంలో కూడా ఇలా పాడగలిగేవారు లేరనటం అనృతం కాదు. 'సహూ' అంటూ 'విచోహన్' అని ఎత్తుకోవటం అద్భుతం అనిపిస్తుంది. ఎన్ని మార్లు విన్నా తనివి తీరదు.

ఇలాంటి క్లిష్టమైన పాటలను సునాయాసంగా పాడినట్టు అనిపించేట్టు పాడటం లత గొప్పతనం. పాట ఒకసారి వింటే తనివి తీరదు. తరువాత ఎన్నిమార్లు విన్నా ఇంకోసారి వినాలనిపిస్తుంది. వింటూన్న కొద్దీ పెరిగే మాధుర్యం తప్ప వెగటు వచ్చే 'తీపి'కాదీపాట. ముఖ్యంగా 'మన్ మే బసే మోహన్' అన్న తరువాత ఇది గొప్ప 'భజన' గీతంలా అనిపిస్తుంది. దాంతోపాటు స్థాయి పెరిగిపోతుంది. ఇక ఎన్నిమార్లు దూర్ జానానా, భూల్ జానా నా , రూఠ్ జానా నా ఎన్ని మార్లు వింటూంటే అంత తీయటి బాధ కలుగుతూంటుంది. ఆ బాధ ఎంత మధురంగా ఉంటుందంటే పదే పదే వినాలనిపిస్తుంది. వింటూనే ఉండిపోవాలనిపిస్తుంది.

ఆందోళనలు, ఆరాటాలు, ఆవేశాలు, హడావిడి, ఉద్విగ్నతలు, ఒత్తిళ్ల ప్రపంచానికి దూరంగా పోయి హిమాలయాల శీతల ఒడిలో, అర్ధరాత్రి వెన్నెల చల్లదనం అనుభవిస్తూ, ప్రపంచానికి దూరంగా, తనలోకి తాను చూసుకుంటూ తనకి తాను సన్నిహితమౌతూన్నప్పుడు కలిగే ప్రశాంత చిత్తమనుభూతి పొందాలంటే కళ్లు మూసుకుని ఈ పాట వింటే చాలు... శరీరం మనుషుల నడుమ ఉన్నా హృదయం ఆనందసాగరాల అలలపై, సుదూర తీరాల్లో సుందరవనాలలో విహరిస్తూ, సత్యం శివం సుందరమైన ఆ ఈశ్వరుడి స్వరూపమైన కళలోని మార్మికతను గ్రహించటం వల్ల సాంత్వనను పొందుతుంది.

కళాకారుడు కళద్వారా వ్యక్తికి తనలోనే భగవద్దర్శనానుభూతిని కలిగించగలడంటారు. అంతటి ఉత్తమ కళా ప్రదర్శన ఈ పాట. అదే కళాకారుడు వ్యక్తిని రాక్షసుడిగా, జంతువుగా కూడా మార్చగలడు. కళా కత్తికి రెండు వైపులా పదునే.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story